పరిశిష్టం

శ్రీ షట్టి కృష్ణమూర్తి

1

"ఎన్నిసార్లు చెప్పినా బుద్ధిలేదు, తలుపు తియ్యడానికి గంట సేపు పట్టవలసిందేనా? గుమ్మందగ్గిర యెంతసేపు నుంచోవాలని నీ ఉద్దేశ్యం?!?" గడియ వదలించగానే తుఫానులా తోసుకు వచ్చి తీవ్రమైన ఆవేశంలో అన్నాడతను. ఆమె కదల్లేదు; స్థైర్యంతో నిలబడి "ఎవరో తెల్సుకోకుండా తలుపుతీసే బుద్ధి నాకు లేదు" అంటూ పదునైన చూపుల్తో అతని కళ్ళల్లోకి తీక్షణంగా చూసింది. అతని మనసు చివుక్కుమన్నది. అంతకు ముందున్న కోపము, విసుగు మర్చిపోయి మామూలు స్థితికొచ్చాడు.

అతడి మనస్తత్వంలోగల వైచిత్ర్యం అదే. ఎంతటి కోపము, మరెంతటి బాధా కల్గినా మరుసటి క్షణంలోనే మర్చిపోయి మామూలు మనిషిగా ముఖకవళికల్లో, కళ్ళల్లో, సంభాషణల్లో గాంభీర్యం తెచ్చుకుంటాడు. అయినా మాటకుమాట అప్పగించే ధోరణిలో ఇలా అన్నాడు—అవును, ఎవరో తెలీకుండా తలుపెల్లా తీస్తావు? కానీ, అంత ధీమాగా తలుపు తట్టగలవాడు ఇంకెవడైనా కావచ్చుననే ఆలోచన కల్గలా, అని.

అతను మంచి మాటకారి. విశేషించి ధక్కా ముక్కీలు తిన్నవాడు కావడంవల్ల ఇతరుల మనఃప్రవృత్తుల్ని తేలిగ్గా గ్రహించగలడు; తదనుగుణంగా నడుచుకోగలడు కూడాను—ఆమె దెబ్బతిన్న దానిలా క్షణం గజిబిజి అయి ధైర్యం కూడగట్టుకుని బింకంగా యిలా అన్నది. 'అయితే అది నీ పొరపాటు. అదృష్టవశాత్తు నా యిష్టం నా చేతుల్లోనేవుంది, అంటూ అటువైపుకు తిరిగి వెళ్ళబోతున్నది. అతను జాలిగా నవ్వుకున్నాడు. అతడామెను లోతుగా అర్థం చేసుకున్నవాడు. పైగా తనకే పైచెయ్యి అనిపించుకోవాలనుకుంటున్నవాడు. అనునయం, ఆగ్రహం తన అధీనంలో అట్టేపెట్టుకుని యెదుట వ్యక్తిపై పారవశ్యతాసంభ్రమాలు ఒలికించి ఫలితం పరీక్షించుకోగల నిబ్బరం కలవాడు—ఒక్క అదిలింపుతో ఆమెను అభిముఖంగా తిప్పుకుని, కొంటెచూపుల కలకలలతో "నువ్వన్నమాట నిజమే, కాని నువ్వు నీది అనుకుంటున్న అదృష్టం, నీ యిష్టానిష్టాలు మరొకరు నిర్ణయించిన దారినే పోతూ వుంటయ్యని తెలియదూ!" అని సమాధానం ఆశించకుండానే తీరుబడిగా మంచంపై నడుంవాల్చి అప్పుడే తెచ్చిన పత్రిక విప్పాడు. మళ్ళీ ఆమె వేపైనా చూడలా. ఆమెకు చాలా బాధ కలిగించింది. ఎదుట మనిషిని అతడంత చులకనగా చూడడం సహించలేకపోయింది. గోడనున్న నిలువుటద్దంలో నిటారుగా కనిపించే తన ప్రతిబింబాన్ని పర్యవేక్షించుకున్నది. ఏదో తెలియని నిరుత్సాహం అర్థంకాని ఆవేదనగా మారి నున్నని ఆమె బుగ్గలపై పులకించి, నుదుట పైకి ప్రాకి, యెదుట ప్రతిబింబం తనదేనా, అన్నంత అనుమానం రేకెత్తిస్తోంది.

అతని కంటికింపచ్చేటట్లుగా వుండాలని ప్రత్యేకంగా అలంకరించుకుంటె అతనికి అలవాటని కమ్మని కాఫీ కలిపి ఫ్లాస్కులో పోసివుంచింది. ఇంత చేసినా అతను తనను అర్థంచేసుకోక తూష్ణీం భావం వహించి, పైపెచ్చు మాటలతో వేధించడం మొదలుపెట్టాడు. దీనికి తను చేజేతులా చేసుకొన్నదేమిటి? అతడు అడుగుపెట్టే సమయానికి ఔదాసీన్యంతో ఉండిపోవడమే కారణమా? రోజూ లేనిది ఇవ్వాళ తలుపు బిడాయించుకు కూర్చోవడం దేనికి?—అవును, అతను రాగానే యెందుకిలా వున్నావని అనునయంగా, లాలనగా, అడుగుతాడని, ఆ తరువాత తను అంతకంటే దీనంగా అతని గుండెల్లో తల ఆన్చి కంఠానికి చేతులు పెనవేసి కళ్ళల్లోకి చూస్తూ పూసగుచ్చినట్టు అంతా వివరించి చెప్పాలనుకుంది. కాని, ఇంత విసురుగా వచ్చి వాల్తాడని కల్లోనైనా అనుకునివుంటే తలుపు వోరవాకిలిగానే అట్టే పెట్టేది—

కొన్ని తావులలో అంతోకొంతకూడా ఆవేశంగా మారగల ప్రమాదంవుంటుంది కాబోలు! అందుకనే తను అతనితో మాటకు మాట బుకాయించింది.

అయినా అతడికి తనపై యీ అధికారం యెవరిచ్చారు? అతడికి తను ఏమిటి? ఏమీ కాకపోతేనే తనపై యింతటి అధికారం చెరపగల్గుతున్నాడా? ఏమైనా అతను పురుషుడు, తను స్త్రీ - వీరియిద్దరినీ సన్నిహితుల్ని చేయగలపాటి శాస్త్రీయమైన బంధం తమ యిద్దరిమధ్యా లేకపోవడం వల్లనే అతడిలా బాధ్యతా రహితంగా రెచ్చిపోతున్నాడా? తన జీవితంలో భాగం పంచుకొన్న మరో కర్తయెదుట యెవ్వడిలా గడుసాయించగలడు? ఇంత ధీమాగా తలుపు తట్టి ఆ పని తనుమాత్రమే చేయగలవని తనపై నేరంమోపి అధికార కంఠంతో గర్జించగలడు? తన జీవితంపై, స్వేచ్ఛపైన, తన సర్వస్వంపైన—అతడికింత అధికారం యిచ్చింది తనేనా? అయితే యిప్పుడీ పశ్చాత్తాపం ప్రకటించుకుని లాభం?

ఇలా గతాన్ని గూర్చి పరాకుగా పరామర్శించుకుంటున్న ఆమె 'ఆ కాఫీ ఇలా అందుకో' అన్న అతడి అదిలింపుతో ఉలిక్కిపడి ఇటు తిరిగిచూసింది. అతను పత్రికలోంచి దృష్టి మరల్చకుండానే

కాఫీకోసం చెయ్యిచాచాడు. తనవంక చూడడానికైనా అతడికింత ఔదాసీన్య మెందుకూ! నిర్లక్ష్యభావం యెందుకో?

ఆచేతికి కాఫీగ్లాసు అందకపోయేసరికి శూన్యంలోనే గుప్పెట్లు మూసి తెరుస్తున్నాడతను. చూపుడువ్రేలు అల్లల్లాడిస్తున్నాడు. అతడి భావం యేమైవుంటుంది? ఎంత చొరవయిచ్చినా, మరెంతగా తన సర్వస్వాన్ని అతడి కర్పించినా, బానిసకావ వేషంగతి ఘాటుగా ఆదరణపూర్వకంగా నిరూపించుకోవాలన్నంత ఉక్రోషం పొర్లుకొచ్చింది ఆమెలో. వేడినిట్టూర్పులకు పెదవుల చంచలనం తోడయింది. మబ్బులుకమ్మినప్పటి ఉక్కలింతలోంచి ఉరుములు బయల్దేరినట్లు ఈమాటలు వెలువడినయ్. 'అవసరమైనవి అందించడానికి దాసీనికాను' అని. వెంటనే తడుముకోకుండా అతడిలా అనేశాడు. "అవును, కనీసం భార్యవుకూడాకాదు" - ఇప్పుడు తల పైకెత్తి ఆమెవంక కొంటెగా చూశాడు. 'అంతేనా?' అన్నట్టు. లేనికైనా హద్దూ - పద్దూ వుండాలి. ఆమె గంభీర ముద్ర వడలింది.

"అందుకే నిదానించి చెపుతున్నాను విను. ఒక్కొక్కడికి కొన్ని ప్రత్యేక అలవాట్లు ఉంటయ్. వాట్లను గమనిస్తూ యెదటి వాళ్లు పోతూవుంటే మన బ్రతుకులు సాఫీగా సాగిపోతయ్, లేకుంటే..."

"ఏమిటి నువు సాధించేది? తలకొట్టి మొలవేస్తావా?"— ఒక్కక్షణకాలం ఉభయులూ ఒకరినొకరు చూసుకున్నారు. అతడిచూపులు కొంచెం కరుకెక్కినయ్. వెంటనే పత్రికలోకి తల దించేసుకుని, మామూలు గాంభీర్యం తెచ్చుకుని - "ఈవాక్యాన్ని సరిగా నువ్వు ఉద్దేశించినరీతిగా పూర్తిచెయ్యగలను, కానీ నా మాటను సాగదియ్యాలనే ప్రయత్నం మానుకో! ఎందుకంటే, వ్యతిరేకార్థం వస్తుంది. నా అంతర్యాన్ని సరిగా తెలుసుకోలేక కుర్రతనాన్ని వొలకబోసుకుంటున్నావ్. నీకు పెళ్లి కావాలనుకుంటే నాకంటే భార్యల్ని సుఖపెట్టేవాళ్లు చాలామంది దొరికేవారు. నా శైల్యరూ నీ మనస్సుకి నచ్చకపోబట్టే నాలాంటివాణ్ణి యెన్నుకున్నావ్. ఒకరినొకరు అర్థంచేసుకున్న భార్యాభర్తలు కొద్దిమందే వుంటారు. చాలామంది గత్యంతరంలేక కొంతకాలానికి అలవాటుపడిపోతారు. అంతకంటే మన సంసర్గం యేమీ తీసిపోలేదు. లేనిపోని తెలివితక్కువభావాల్తో తల చెడగొట్టుకోకు!" —ఆమె ముఖకవళికల్ని గమనించడానికి కాబోలు, తల పైకెత్తి అలవోకగా చూశాడు. ఆమె పలకలేదు, ఉలకలేదు.

"ఏం గడచినగాథలన్నీ నాచేత పాడించాలనా? ... తిరిగి సూటిగా అడిగాడు. "అక్కర్లేదు, అని కచ్చగా తలత్రిప్పడంతో, తలలో సన్ననిపాయతీసి వొయ్యారంగా అమర్చుకున్న సంపంగి పువ్వు బుజంపైబడి, పైట మీదుగా క్రిందకుజారి కాళ్లముందు పడింది. చటుక్కున అతడు దానిని చేత్తో తీసుకుని రేకలు సవరించుతూ ముక్కుకు సూటిగా చేర్చుకుంటున్నాడు. అతడి ముఖంలో యేదో అవ్యాయత తృప్తి రేఖామాత్రంగా చూడగల్గిందామె.

తద్దన్నలేకాని అతను చెప్పేవన్నీ యదార్థాలని మనసు సాక్ష్యం పలుకుతూ హృదయాన్ని వొప్పుకోమని నిర్బంధిస్తోంది.—

అవును,—తనని చులకనగా అత డెన్నడూ చూడలేదనేది నిజమే. అన్నిటికంటే తను చెప్పాలనుకుంటున్న మాటలు అతను చెప్పడం, తను నోరెత్తలేకపోవడం బలహీనత! అతను మామూల్లా స్వార్థపరుడే అయితే, తన జీవితస్థాయిని లెక్కచెయ్యనివాడే అయితే, అమ్మన్న తాను సుస్తీచేసి వారంరోజులు కదలలేకపోయినప్పుడు, అతనూ ఆఫీసు మానుకుని చాకిరీ చెయ్యాలా? తను కోరిందిన విషయాల్లో యెంతగానో సతమతమౌతూవుంటే అవన్నీ మాన్పి జీవితంలో వొక తీరైన స్థైర్యం యేర్పరచాలా? తన వ్యక్తిగత విషయాన్ని గురించి అత డెప్పుడు పట్టించుకున్నాడు? ఒకనాటి రాత్రి అతడి మనసు పరీక్షిద్దామని, తను బాగా అలంకరించుకుని తనకోసం వొక మిత్రుడు వేచివుంటాడని వెళ్లిపోతూవుంటే అత డేమీ మారుపల్కలేదు; ఈనాటికీ అలాగే వున్నాడు. అది అతని స్వభావమా? పెచ్చుపెరిగిన స్వార్థమా? ఎటూ తేల్చుకోలేక, సమాధానపడ్డానికి యిష్టంరాక అహం అడ్డొచ్చి ఆమె అలాగే వూరుకున్నది.

అతడు తిరిగి తలెత్తి ఆమె ముఖంలోకి పరకాయించి చూశాడు. తనమీద పట్టలేనంత ఉక్రోషంతో బుంగమూతిపెట్టి ఏమీ అనలేక లోలోన మథనపడుతున్నట్టు ఆమె రూక్షేక్షణం వివరించినట్లయింది. తనూ అలాటి పట్టుదలకేపోయి మాటామంతీ లేక వూరుకుంటే యెప్పటికి తెల్లవారను? ఆ గభీర నిస్తబ్దత మరింత దుస్సహమనిపించిం దతనికి? అయినా తన కెందుకీ అర్థంలేని అహంభావం? ఎందుకీ మూగనోము?

పేపరు మంచంమీద వేసి చటుక్కున అక్కణ్ణించి లేచాడు. అతడి ముఖంలో యెన్నడూలేని లేతదనం వెల్లివిరిసింది. క్రింది పెదవి మునిపంటితో నొక్కుతూ వోరగంటితో ఆమెవంక చూశాడు. అతని పాదాలు ఆమె ప్రక్కగా నడిచినై; అతని బాహువులు ఆమెకు అలుముకున్నయ్; అతడి రెండు కళ్ళూ ఆమె కళ్ళల్లోకి తొంగిచూసి లోతులు వెతుక్కుంటున్నయ్, కదిలే పెదవులు, స్పర్శసుఖంతోపాటు మాటల సొంపునుకూడా వెలువరించి పైకొన్ని మమతగామార్చే ప్రయత్నంలో ముక్కునను అలవర్చుకుంటున్నయ్; ఒక చెయ్యి పట్టువీడి చెంపలమీంచి చుబుకం మీదుగా హృదయంపైకి జారి భావోద్రేకం చెప్పే ధమనుల్ని లెక్కపెడుతోంది. "ఏం చేసేవున్నావని? నీకంత కసి? ఉన్న మాట అంటే...."—దరాల్ని అతణ్ణి విదిలించుకోవాలని ప్రయత్నించింది. అతని చేతిపట్టు వీడనందుకు, తను పరాజిత అయినట్టు తన అబలత్వాన్ని తెల్పుకుని మరింత గిజగిజలాడింది. చెయి కొరికి అయినాసరే విడిపించుకోవాలనుకుంది; కాని గాయమౌతుందనే ఆలోచన కలగడంతో గుండె గతుక్కుమని, ఒక్కసారి యెక్కడలేని అలసటొచ్చి వేళ్లాడిపోయింది. హృదయం మరింత వేగంగా కొట్టుకొనసాగింది. కళ్లల్లో నీళ్లు తిరిగాయి, తనమీద తనకే అసహ్యం తోచింది. ఛీ. ఎంతచులకనయ్యాను, అని కొండంత బరువుతో ప్రశ్నించుకుంది.

ఒక్క క్షణం అలా గడిచాక అతడామెనువదలి సరాసరి ఫ్లాస్కు తీసి కాఫీ కప్పునిండా పోసుకుని చప్పరించుతూ ఇటుకేసి దీక్షగా చూశాడు. ఆమె అక్కణ్ణించి కదిలి అతడిమొహంలోకి చూడడానికి సిగ్గయి అటు పెడగా తిరిగి నిల్చున్నది. మరో గ్లాసు నింపి ఆమెనోటి కందిస్తూ," అనిశ్చితత్వం ఆట్టేసేపు భరించలేనని తెలుసుగా! వేడివేడికాఫీ చప్పరించి, మనసు చల్లబర్చుకుని, మామూలులోకంలోకిదిగి, మనసంగతి ఆలోచిద్దూ!" అన్నాడు. ఆమె సిగ్గుతోనూ, పశ్చాత్తాపంతోనూ క్రుంగిపోయి నోట మాట పెగిలిరాక ఊరుకుంది; ఆప్యాయంగా నోటి కందించిన కాఫీ కాదనలేకపోయింది. – కాళీ గ్లాసు బల్లమీద పెడుతూ 'ఏం కోపం వచ్చిందా?' అని సాగదీస్తూ అడిగింది. అది 'తెలివితక్కువ ప్రశ్న' అని ఆమెకు తెలుసు. అతనికి నిజంగా కోపంవస్తే యింతదాకా రానీడనే సంగతీ తెలుసు: కాని, హృదయావేగం కొంత తగ్గారి నందువల్ల, ఆక్షణంలో అతణ్ణి ఆప్రశ్న అడిగి సమాధానం రాబట్టడం, అతనియెడల తన హృదయాంతరాళంలోవున్న మక్కువకు తార్కాణంగా భావించవచ్చు ననుకుంది. – అతడు ఏమీ చెప్పక సూటిగా మంచంమీదకువెళ్ళి పత్రిక చదవడంలో నిమగ్నుడయాడు.

తిరిగి రోషంపైన అతణ్ణి పలకరించి సన్నిహితుణ్ణిచేసుకోవాలో ఆమెకు తోచలేదు. అత డెంతసేపైనా అలాగే ఊర్కోగల డనుకుంది. పంతం నెగ్గించుకోవాలనే పట్టుదల సడలాక అతడికి దూరంగావుండి పలకరించడం, ఉత్తుత్తిసమాధానాలతో కాలం వెళ్లబుచ్చడం, మరింత దుర్భరంగాతోచింది. రెండడుగులు ముందుకు నడిచి, కొండంత అనుమానంతోనూ, భయంతోనూ వెనక్కుతగ్గి ఒక చేత్తో బల్లపై బడివున్న వస్తువులు సర్దుతూ అలాగే నిలబడిపోయింది.

అతడంటే తన కీక్షణంలో అంత జంకు యెందుకు కలగాలి? రోజూకంటే అతడిలో యీనాడు కనిపించే వైలక్షణ్యం యేమిటి? అతడిమొహం రోజూలా చిరునవ్వు చిందించుతూ తనను అటుకేసి ఆకర్షించుకోవడంలేదా? ఎందుకనో మరింత గంభీరమై కొట్టొచ్చి నట్టు కానవస్తోంది. ఇదంతా అతడిస్వార్థమేనా? అని మరోసారి ప్రశ్నించుకుని కాదు, అన్నట్లు తలూగించుకున్నది. 'ఇలా రా!' అని అతడు పిలుస్తాడేమో అని. ఇవ్వాళ ఇలా యెందుకు ఉన్నావని అడుగుతాడని, తేనెమాటలు విని ఓదార్పుగా తల నిమురుతూ యింతమాత్రానికే చేలనైపోవాలా? అని బుజ్జగించి బుగ్గలు నిమురుతూ కళ్ళల్లోకి లోతుగాచూసి డగ్గుత్తికతో దైన్యం ఒలకబోస్తూ మాట్లాడగలడని, ఇంకా యేమేమో ఆశించింది, కాని, ఇందాకటి మాటలకంటే యీ మౌనం మరింత భయావహంగా తోచింది.

తడికే చేతులతో ప్రక్కనున్న వాలుకుర్చీ లాక్కుని భారంగా కూలబడింది. ఎంతోసేపు అతని మొహంలోకి చూస్తూ అంతులేని ఆందోళనతోనూ ఉక్కిరిబిక్కిరిచేస్తున్న ఆవేశాలతోనూ అల్లాగే వుండిపోయి తమ పరిచయం అదిగాగల విషయాన్నిగూర్చి సింహావలోకనం చేసుకుంటున్నది—

—అతని మంచితనం, మాటనేర్పు, కళ్ళల్లో లోతైన భావాలతో కూడిన ఒక ప్రత్యేకాకర్షణగల అతని మొహం బలిష్ఠమై పొంకంగావున్న శరీరం, అతనికున్న విజ్ఞానం, ఇతరులపట్ల అతనికున్న సానుభూతి, ఒక నియతమైన మార్గము ఆదర్శము లేకుండా అతడు గడుపుతున్న జీవితం ఎప్పుడూ వ్యక్తపరచే అతడి సంతృప్తి తనంటే అతనికున్న అభిమానం, తనపై మొదటగా అతని ఆకర్షణ, దాపరికాలు లేకుండా తననిగూర్చి అతను చెప్పుకొనే నిజాలు— వీట్లలో తన నేది ఆకర్షించింది? ఏ వొక్కటీకాదు; అన్నీ ఆకర్షించి వుంటయ్. వీట్లను ఆధారంగా గొని అతడికి మరింత సన్నిహితురాలుగా వుండాలనే క్షణం క్షణం అనుకుంటూవచ్చింది.

హఠాత్తుగా తనను ఇక్కణ్ణించి బదిలీచేయ బోతున్నారని మధ్యాహ్నం తన స్నేహితురాలు వసుంధరవచ్చి చెప్పివెళ్ళడం జ్ఞాపకమొచ్చి ఉలిక్కిపడింది. అమ్మయ్యో, నా కిక్కణ్ణించి ట్రాన్స్ఫరే? అన్నంత భయదమైన ఆవేశంతో గుబగుబలాడింది. వెన్నున ఝల్లుమని చరచినట్లయింది. రెండుకాళ్ళూ పైకి ముడిచి చేతులతో బంధించి పెనుగాలికి అల్లల్లాడే గువ్వలా వణికిపోతూంది. పెదవులు నల్లబడి, వెచ్చదనంకోసం వెంపర్లాడే పసిపాపలాగ గజ గజ లాడిపోతోంది.

మరోక్షణంలో పట్టుతప్పి పక్కకు వొరిగిపోయేదే, కాని అతప్పుడే తలెత్తిచూడడం, ఆమె దైన్యావస్థను గురించి 'సుందరీ!' అనే పిలుపుతోపాటు చివాల్న ముందుకువాలి రెండుచేతులా ఆమెను కమ్ముకోవడం జరిగింది—

"రాధా. నన్ను క్షమించవూ?" అంటూ తన రెండుచేతులా అతని వెచ్చటి నుదుటిని తన నుదుటిపై నొక్కుకుంటూ కరుణావిలంగా కళ్ళల్లోకి చూస్తూ అడిగింది సుందరి.

"ఎందుకని? నువుచేసిన పొరపాటు నాకు చెప్పడానికి భయమెందుకు? "అని గంభీరంగా వోదార్చుతూ వెన్నున చేత్తో రాస్తున్నాడు రాధ; అతడి పూర్తిపేరు రాధాకృష్ణమూర్తి.

తన చెంపను అతడిచేతి కందిస్తూ చెయి గట్టిగా పట్టుకుని, 'నన్ను మద్రాసుకు బదిలీచేస్తారని ఆఫీసులో అనుకుంటున్నారట' అన్నది సుందరి. అతడు కళ్లెవిప్పి ఆమె మొహంలోకి పరకాయించి చూసి "అందుకనా యిందాకట్ణించీ అంత దిగులుగా కూర్చున్నావు! ఏం ఎవరన్నారామాట? మద్రాసు వెళ్ళడం నీకు ఇష్టం లేదా?" అంటూ ఆమెను మరింత దగ్గరకు గదుముకున్నాడు. 'నాకింకా రూఢిగా తెలియలేదు, కానీ, ఇక్కణ్ణించి ట్రాన్స్ఫర్ చెయ్యబడేవార్ల జాబితాలో నేనూ వున్నానని మాత్రం తెలుసు. అందుకనే భయంగావుంది. నిజంగా...' అని వాక్యం పూర్తి చేయడం అమంగళంగా తోచి అంతటితో వూరుకున్నది సుందరి.

'సరే కానీ, ఎంత ప్రాప్తమో అంతే' అని పొడిగా బదులు చెప్పి వూరుకున్నాడు రాధ. సుందరికి పట్టలేనంత దుఃఖం పొర్లుకొచ్చింది. తను బదిలీనుగురించి యింత ఆందోళనపడుతుంటే ఒక్క వేదాంతం ముక్క అని వూరుకున్నాడని.—అసలు అతని కెందుకుంటుంది ఆదుర్దా? తను లేకపోతేమాత్రం అతనికేం కొదవ? తనలాటివాళ్లు అతనికి అరుదు కాదు. అతని తత్వం యెప్పుడూ యింతే. దేనినీ లోతుగా ఆలోచించడు—

అసలతని జీవిత విధానమే అంత. తనలాగే యితర్లని తేలికగా గాలి పడగలక్రింద కట్టవాలకి వదలాలని చూస్తూవుంటాడు. అయినా తన లాగే యితరులూ బాధపడాలనుకోవడం తెలివితక్కువ కాదూ? తనకు ట్రాన్స్‌ఫర్ చేసింది యెవరు? చేయించింది యెవరు? ఆ విషయం వసుంధర తనకు పనివేళ్ళా చెప్పవేళ్ళట మెందుకు? దాని మొగుణ్ణి మద్రాసునించి యిక్కడకు వేయించడానికి వాళ్ళ నాన్న పలుకుబడి అంతా వుపయోగించి వందిని పందిని చెయ్య లేదూ? అతగాడు ఇక్కడకు దిగితే యిద్దరూ కులుకుతూ అన్నగారి నీడపైన కాపురం వెలిగించాలని కాదూ దాని దుర్బుద్ధి?—

వసుంధరనుగురించి తను పొరపాటు ఊహించుకుంటున్నదేమో... విశ్వేశ్వరరావు దానికి మొగుడు. తనూ అతనికీ చేరువలో వుండాలనుకోవడం దాని తప్పా? ఏభార్య భర్తతోపాటు సుఖంగా ఉండాలని వాంఛించదు? తను ఇక్కడే శాశ్వతంగా వుండాలని యెందుకనుకుంటున్నది? తనకు రాధ యెవరు? ఈ ప్రశ్న పొటమరించడంలో గజిబిజిఅయి అతణ్ణి మరింత గాఢంగా హత్తుకుని తన ఆత్మీయతను నిరూపించుకోవాలని చూసింది. కాని అతని నోటి వెంట సాంత్వనంగా మరోమాట వెలువడలేదు—

ప్రతిప్రాణికీ అప్పుడప్పుడూ యితరుల సానుభూతి అవసరమౌతూవుంది కాబోలు. తను ఈ స్థితిలో అతని సానుభూతిని ఆశించింది. వాచా అది పొందకపోవడంతో మనసు మరింత ఉద్విగ్నమైంది. ఆమె కన్నీళ్లు అతనిగుండెలకు చల్లగా తగిలినయ్, జాలిగా నవ్వుతూ ఆమెవంక ప్రశ్నార్థకంగా చూశాడు.

'నేనింతగా కుమిలిపోతూవుంటే నీకు చీమకుట్టినట్లయినా లేదు, అంటూ అమాయికంగా అతనికేసి చూసింద. ఇంకా యేదో చెప్పుకోవాలనుకొంటున్నట్టు పెదవుల కదలికవల్ల గ్రహించాడు రాధ. వెంటనే ఆమెను అటు ఒత్తిగిలించి, "ఇందులో బాధపడవలసింది నాకేమీ కనుపించలా. మద్రాసు ఈవూరికంటే బాగుంటుంది. అక్కడవుంటే సత్కాలక్షేపానికి, విజ్ఞానోపార్జనకు, మంచి అవకాశం. ఇంక ప్రశాంతత అంటావా?, అది కొని తెచ్చుకొనేదికాదు. పోతే...నాసంగతంటావా..., కాస్త ఆగాడు. ఆమె ఆతురతతో అతనివంక జూసింది, తనసంగతి యేమిచెప్తాడో అని. రాధ ఒక్కక్షణం దీర్ఘాలోచనలోపడ్డాడు. ఏమి చెప్పాలా అనికాదు; ఎలా చెప్పాలా అని. మళ్ళీ తలెత్తి చూశాడు. అనునయంగా చెప్పవలసిన అవసరం గ్రహించినట్లున్నాడు. ఇలా ఉపక్రమించాడు,

'ఇంకా కొంతకాలంవరకూ మనం విడిపోయేటప్పటి యీబాధ తాత్కాలికమైనదే అవుతుందని నా నమ్మకం. నా అనుభవాన్ని బట్టి చెబుతున్నాననుకో! నాకంటే నువ్వు యెక్కువబాధ పడుతున్నావు. కానీ, క్రమంగా కొత్తవాతావరణానికి అలవాటు పడిపోతావు. ఇంక యీరాత్రికి జాగారం చాలుగానీ, యిక్కడ వుండే నాలుగురోజులూ వృథాచేయవద్దు, నీ బదిలీసంగతి నాకూ మధ్యాహ్నమే తెలిసింది." అని వూరుకున్నాడు రాధ.

"అయితే నువ్వెప్పుడూ నాకు మల్లేబాధపడలేదా యిలాంటి అవాంతరాల్లోకి?" పసిపాపలా అడిగింది సుందరి—"పిచ్చిదానా, నేనూ మనిషినే అందరికీవుంటేభావావేశాలే నాకూ వున్నాయ్. ఎన్నింటికని ఏడవనూ? బాధపడే తీరుబాటుకూడా లేకుండా కొత్త బాధలు వచ్చిపడుతున్నయ్. వాటిని తట్టుకోవడానికి కావలసిన గుండె నిబ్బరం పరిస్థితులే చేకూరుస్తున్నయ్ ఇంతవరకూ. కాని, భవిష్యత్తులో యెప్పుడో యిలాటి అలవాట్లకు శాశ్వతంగా పరిష్కారం చూసుకుంటాను. నిజంగా నేనుపడ్డ పడుతూన్న మానసికబాధలు నీకేం తెలుసు? ఏదో చెయ్యాలనుకుంటాం మరేదో చేస్తాం, కాలప్రవాహంలో కొట్టుకుపోతూవుంటాం: అందుకనే దక్కినంతే చాలునని తృప్తి యెప్పుడూ వుంటుంది నాకు. నువ్వూ దానికి అలవాటుపడితే మనస్సు కొంత కుదుటబడుతుంది"— అతను మాగన్నుగా అటు వొరుగుతున్నాడు. అతను తననించి దూరమైపోతాడన్న భయం అంకురించగానే ఆమె మరింతదగ్గిరగా జరిగి అతడిమీద చెయి వేసింది, జంకుగా. కాని ఇవాళ అతనెందుకనో చిరాకుపడినట్టులేదు. కొంతసేపటివరకూ తన భవిష్యత్తును గూర్చిన ఊహాగానాల్తో కాలం గడిపింది. బల్లమీద గడియారంలో ఒంటిగంట అయింది. సుందరి మెల్లిగా లేచికూర్చుంది. అతను గాఢనిద్రలో వున్నాడనుకొందిలావుంది, మితిమీరిన ఆవేశంతో ఆప్యాయంతో అతనిగుండెల్లో చేయివేసి నిమురుతూ మొహం దగ్గిరగాజేర్చి అతనిమొహంలోకి చూసింది. ఆతొందరలో తన పెదవులు అతడి బుగ్గలకు తాకడంకూడా గమనించలేకపోయింది. మూసినరెప్పల్లో కనుగుడ్లు కదులుతున్నట్లయి కొంచెం సిగ్గుపడింది. తను ఇంతగా యెన్నడూ చొరవతీసుకుని యెరగదు. 'మేలుకొనే వున్నావా?' అని గాభరాగా అడిగింది సుందరి. అఁ...ఏదో కలొచ్చింది, ఆలోచించుకుంటూ యీ లోకంలోకి వస్తున్నాను, అన్నాడు రాధ కన్నులు తెరవకుండానే. 'నన్నుగూర్చేనా?' అడిగింది సుందరి; తన ఆదుర్దానుగురించి అతడు నవ్వుకుంటాడేమో అని అనుమానించుతూనే. 'ఊఁ...' అని పెదవులు కదల్చకుండానే చిరునవ్వు నవ్వాడు రాధ.

'ఏమిటి?' అన్నది సుందరి — 'పడుకుందూ, ఇంకా యెంతసేపు మేల్కొంటావ్? నిన్నుగురించే కలొచ్చింది. దానినిగురించే ఆలోచించుకున్నాను మెలకువగా, అన్నాడతను. అమాయకంగా ఆనంద వివశురాలయిందామె. 'ఈరోజు నేను మర్చిపోలేను యెప్పటికీకూడా, అన్నది. 'బాగా ఆలోచించుకుంటే జీవితమూ ప్రతిరోజూ అంతే' అన్నాడతను. నిజమే అనుకున్నది సుందరి; గుండెల్లో బరువు సగం తగ్గినట్లయింది.

2

ఉదయం నిద్రలేచే సరికే మంచంమీద కూర్చుని అతనేదో పుస్తకం చదువుకుంటున్నాడు. 'అప్పుడే లేచావా", అన్నది సుందరి, కుప్పిళ్లు బిగించి, నడుము సాగేటట్లుగా వొళ్లు విరుచుకుంటూ - "బాగుంది నీకు మల్లే నాకూ కాలం విలువ తెలియక పోలా, అవసరాలు తీర్చుకురా, టిఫెను కాఫీలు తెచ్చాను, అన్నాడు రాధ, ఆమెవంక అదోలా విలక్షణమైన భంగిమలో చూస్తూ "ఎందుకు కాఫీ. నేను కాచియిచ్చేదాన్నిగా" అన్నది సుందరి అతనివంక తృప్తిగా చూస్తూ.

"ఈ నాలుగురోజులూ నిన్ను అట్టే కష్టపెట్ట దల్చుకోలా." అన్నాడతను.

"పాపం రోజూ వేళ్ళకి కాఫీ అందియ్యకపోతే పరితాయించే మనిషికి యివ్వాళ అమాంతంగా యింత జాలికల్గిందేమా?" అని, అందామె లేచిపోతూ మోచేతిమీద ఆనుకుని.

"వస్తువు అందుబాటులోనించి తప్పుకున్నప్పుడు దాని విలువ పెరుగుతూ వుంటుంది." అన్నాడతను పొడిగా నవ్వుతూ.

"నువ్వెంత మంచివాడవు," అందామె, అతని కెదురుగా వచ్చి మోకాళ్ళపై రెండుచేతులూ ఆన్చి.

పుస్తకం ముఖం ముందునించి పక్కకు జరిపి, "నాలో మంచిచెడుగులు ఇంచుమించు సరిపాళ్ళంలోనే మేళవిస్తున్నాయ్" అన్నాడు రాధ సిద్ధాంతం వెలువరించే ధోరణిలో.

"ఒకళ్ళ మంచిచెడుగులు నిర్ణయించాల్సినవారు ఇతరు లనుకుంటాను" అంటూ కనుబొమలు పైకిలాగి ఇప్పటికి మొదటిసారిగా విజయగర్వం ఉట్టిపడేలా ముఖం పెట్టింది సుందరి.

"అది పొరపాటు, దొంగతనం చేసేవాడు అది తప్పని తెలిసే చేస్తాడు, అయితే తెలిసికూడా అలా చేయడానికి గల కారణాలు అంతరార్థాలు చెప్పడం ఇప్పుడు పడదు. మంచిపనికూడా అలాగే వూహించుకుని చేస్తాడు, కనీసం అది తన ధర్మం అనుకుంటాడు. సరే మంచిచెడుగుల్ని గురించిన మీమాంసచాలు గానీ, బజారుకెవెళ్దాం తొందరగా తెములు!...అంటూ మళ్లీ పుస్తకంలోకి దృష్టిపోనిచ్చాడు—

—బజార్లో అతనితో షాపుకి వెళ్ళడానికి మొదట కొంచెం జంకింది. కాని తరవాత గర్వపడింది. ఏమైనా యింత చొరవగా వెంట పోగలగడానికి అతను తనకేమిటి?" అన్న బాధ అడుగడుగునా వేధించుతూనే వున్నది.—షాపువాళ్లు అతనిపట్ల చూపిస్తున్న అభిమానం, వాళ్లు అతనికిచ్చే గౌరవం చూసి ఆశ్చర్యపడింది. బైట కొచ్చి "నువ్వంటే వాళ్ళకంత గౌరవం యెలా వుంది?—అయిన కాడికి సుద్దలు కొనడానికి మీరంత భాగ్యవంతులు కాదన్నావుగా!" అన్నది సుందరి అతిడి ప్రక్కగా నడుస్తూ.

"అదా నీ సందేహం! డబ్బునిబట్టి వచ్చే గౌరవం వేరు; వ్యక్తిగతమైన విలువల్నిబట్టి వచ్చే దింతేకంటే ఘటేది. పైగా నీలాంటి అందమైన అమ్మాయి చెలికత్తెతో గడప త్రొక్కగానే గవర్నరు హోదాతో సమానం అనుకుంటారు కొందరు మూఢులు" అన్నాడు రాధ, తల అటు త్రిప్పకుండానే. వాక్యం చివరి భాగం ఆమెను కొంచెం బాధించింది. అతను చెప్పినట్లుగా అన్ని కావాలంటే పన్నెండుకి యెలా లభ్యమౌతాయ్? అతని ప్రక్కగా నడుస్తున్నది సుందరి పరధ్యానంగా. చీర కుచ్చెళ్లు కొంచెం చెప్పు కాలిలో యిరుక్కున్నట్లై ముందుకు తూగి చేత్తో అతణ్ణి కాచుకుంది. దారి చూసుకు నడు!" అంటూ తల త్రిప్పకుండానే హెచ్చరించాడు రాధ.

—ఇంటికి వెళ్ళాక మళ్ళీ వొకసారి బట్టలన్నీ చూసుకున్నది. డబ్బు సంగతి జ్ఞాపకం వచ్చి, "నా పర్సు విప్పినట్లుంది—అంత డబ్బూ......"

"అవును నేనే యిచ్చాను" అన్నాడతను. చేతులు వెనక్కు కట్టుకుని ఏదో ఆలోచించుకుంటూ యిటూ అటూ పచార్లు చేస్తున్నాడు.

"నువ్వు ఇబ్బంది పడతావేమో..." సుందరి.

"ఫరవాలేదు, ఈ దఫాకి నేనే కొనదల్చాను" రాధ.

"మరేమీ అనుకోకపోతే వొక్క మాట..." ప్రశ్నార్థకంగా అతనివంక చూసింది సుందరి.

"ఏవో అనుకుంటారని చెప్పదల్చుకున్నది మానుకోవడం యెప్పుడూ మంచిది కాదు" అన్నాడతను పచార్లు చేస్తూనే.

"ఈ పూట మన యిద్దరికీ యిక్కడే వంట చేస్తాను" అన్నది సుందరి అతనికి యెదురుగా వచ్చి సంకోచిస్తూ.

"ఓ...తప్పకుండాను. నువ్వు వండినా వచ్చు, నేను తిననూ వచ్చు, అయినా వొకదాంట్లో లేని అంతులు, అభ్యంతరాలు మరొకదాంట్లో వుండవు నాకు. నువ్వు వెళ్ళేదాకా యిక్కడే భోంచేస్తాను నీకంత ముచ్చటగా వుంటే. కాని, నేను శాకాహారిని మాత్రమేనని తెలుసుగా!" అన్నాడు కొంటెగా చూస్తూ. తన పైనించి మరో బరువు దించేసినట్లయింది సుందరికి.

అన్నం వడ్డించనా? అన్నది సుందరి వంటయింటి గుమ్మంలోనించి. అంతట్లోనే తన గొంతూ మాటలతీరూ అదోలా మారిపోవడం చూసుకుని, ఆశ్చర్యపడింది. కాని, యీ వ్యవహారం చాలా పరిమితమనే సంగతి తెల్చుకున్నప్పుడు గుండెల్లో గతుక్కుమన్నట్లయింది. వెంటనే రాధ తనకు యెవరు? అన్న అనుమానంతో బాటు తెలియని ఆవేశం కమ్ముకున్నది. వెంటనే విభాయించుకుని వడ్డన పూర్తిచేసి మరొక మారతణ్ణి పిల్చింది.

ఆమెకు అన్నం సయిదడం లేదు. అతనుమట్టుకు దీక్షగా తల ప్రక్కకు తిప్పకుండా పట్టించుకున్నాడు. "వంట బాగుందిలా?" ఎందుకు అడిగానా అని నాలుక కరుచుకున్నది.

"ఆఁ ..కాలేకడుపుకి మండేగంజి. అయినా చేతనైనంత వరకూ యేలోటూ జరగనేలేదు" అన్నాడు రాధ, తలెత్తకుండానే. ఆమె భోజనం యెక్కడిదక్కడే వుండిపోయింది. ఎంతో సేపటివరకూ అతని వంకకు చూస్తూవుండడంలోనే సరిపోయింది. ఏదో తెలియని అలసట, ఆవేశం ఆమెను నిలువెల్లా కమ్ముకుని అన్నం గొంతు దిగనీలేదు. మధ్యాహ్నం యేదైనా తెప్పించుకు తినవచ్చునని తృప్తిపడి వూరుకున్నది.

తీరుబడిగా మంచంపై వడుంవాల్చి సిగరెట్టు ముట్టించాడతను. వంటయింట్లో పని పూర్తిచేసుకుని బట్టలు మార్చుకుని అతని యెదటికి వచ్చింది సుందరి.

"అయితే యింతకాలం నువ్వెందుకు పెళ్లిచేసుకోలేదూ?" అంటూ సూటిగా అడిగింది వక్కపొడి డబ్బా చేతికిస్తూ.

"ఒట్టి పొగరెక్క—", అన్నాడతను.

"అయితే కానూవచ్చు" సుందరి చటుక్కున నాలుక కరుచుకున్నది.

"నేను నిజమే చెప్పాను, అన్నా తడను, మంచంమీంచి లేస్తూ—ఆఫీసుకు పోతున్నాను వీలుంటే సాయంత్రం వస్తా, లేక పోతే రేపు కనిపిస్తా" అంటూ చెప్పులకు బెల్టు పెట్టుకుంటున్నాడతను.

"ఏం నాలుగురోజులూ నీ బస యిక్కడే అన్నావుగా మరి, రాత్రి భోజనం..." మాట సగంలోనే అందుకుని, "అవును అన్నాను, ఇప్పుడు జ్ఞాపకానికి వొచ్చింది, మా మేనేజరుగారు ఇవ్వాళ సినిమాకు రమ్మన్నాడు. బహుశా భోజనం యేర్పాటు కూడా అక్కడే జరుగుతుంది." అన్నాడు రాధ—అడుగు ముందుకు వేయబోతూ.

"మరైలే..."

"రేపు ఉదయాన వస్తాను ఏం?...అన్న అతడి ప్రశ్న సుందరి చెవులకు కొంచెం కటువుగానే తోచింది. అతడు గడపలు దిగాడు. ఎంత సన్నిహితంగా వుండాలని ప్రయత్నించుకున్నా యేదో వొక మాటలో తనను దూరానికి నెట్టివేస్తూనే వున్నాడు. అతడు చెప్పింది నిజమేనా? నిజానికి తనపై అంత మమకారమేవుంటే సినిమాకు వెళ్లడం మానేసి యిక్కడికే రారాదూ? ఆమాట మొహంయెదటనే అడిగితే యెలాగుండేదో...కానీ, అతను రోడ్డుమలుపు తిరిగి పోయాడు—

తలుపుకి తాళంవేసి ఆఫీసుకు వెళ్తుతూ తీరుబడిగా ఆలోచించుకున్నది సుందరి. 'అతడు చెప్పింది నిజమే నేమో...సాధారణంగా అబద్ధం ఆడడు. కాకపోతేమాత్రం తనేం చెయ్యగలదు? అతడేచెప్పినట్టు ఎంతదక్కితే అంతే ప్రాప్తమనే నిబ్బరంతో కాలక్షేపం చెయ్యాలేమో...

—ఆరోజు నిజంగానే సుందరి ఆఫీసులో కాలుపెట్టేసరికి నమ్మలేనంత యింద్రజాలం ప్రత్యక్షమయ్యింది. తను రోజూ కూర్చుండేకుర్చీదగ్గిర వసుంధర మొగుడు విశ్వేశ్వరరావు కూర్చుని బల్లపైవున్న ఫైళ్లు తిరగవేస్తున్నాడు. అతడికీ అధికారం యెవ్వరిచ్చారు? నిర్ఘాంతపోయి గుమ్మంలో చేరబడినిల్చుంటే అయ్యగారు పిలుస్తున్నారని జవాను వార్త అందించాడు. ఆఫీసరువద్దకు నేరుగావెళ్లి, అతడికి ఛార్జీ వప్పగించి, బదిలీ కాయితం చేతబట్టుకుని ఒక్కదణ్ణం పెట్టి తిరిగి వస్తావుంటే టీపార్టీ, అన్నాడెవడో...

విశ్వేశ్వరరావు ఇన్నాళ్లకు ఇక్కడకు రాగల్గినందుకు ఆఫీసు స్టాపుకంతకీ యీనాటి అపరాహ్ణంలోనే టీనీరు ఇప్పించబోతున్నాడట! ఇంకానయం! తను వెళ్లిపోతున్నందుకు కాదుగదా!! పిల్లికి చెలగాటము, ఎలుకకు ప్రాణసంకటమూను—

—కాళ్లీడ్చుకుంటూ యింటికివచ్చి మంచంపై వడుం వాల్చింది సుందరి. వచ్చేదాకా రావాలన్న తహతహేగాని, వచ్చి యేంచెయ్యాలో తోచడంలేదు. ఈ యేకాంతం మరింత ఖంగారుగాను, భయావహంగాను ఉంది. అయిదుసార్లు గడియారంవంక చూసినా రెంటికి పదినిమిషాలుంది. అతడెప్పుడువస్తాడో...తనూ అతడి ఆఫీసుకి వెళ్లివుంటే...ఇంకేమైనా వుండా? తన తొందరపాటుజూసి అతడు కంటగించుకుంటే...అసలే తెలివితక్కువ జరిగిపోయింది. తన ఆఫీసునుంచే నేరుగా అక్కడికి వెళ్లివుంటే... ఎందుకీ ఆత్రత?—తనకు బదిలీఅయిందికదా అని అతడికి పెందరాళ్లే యింటికివెళ్తే 'పర్మిషన్' వస్తుందా? అక్కడవుంటే మరీ పిచ్చి ఎక్కేటట్టుంది. ఎక్కడో ఏదో ఎడారిలో ఒక్కర్తే వుండిపోయినట్లనిపించింది. ఇంక అతణ్ని గురించి ఆలోచించడం మానుకుని తన ముందు కార్యక్రమం నిర్ణయించుకుంటే...—మనసు మెదడుపైన టప్పున రెచ్చకొట్టినట్లయింది. అతడితో తనకు గల అనుబంధం అంత క్షణాలమీద మర్చిపోదగినంతటిదా? తననైజం అందుకు వప్పుకుంటుందా? లేక అతడు తనకు వొరగబెట్టేదేమిటి? ఏమైనా అయివుండొచ్చు, అతడు అబద్ధం ఆడడని కాదూ తన విశ్వాసం? కావచ్చు, తన భవిష్యత్తునుగూర్చి యేమైనా వాగ్దానం చెయ్యగలిగాడా? లేకపోతే యింతటిలో మనసు రాయి చేసుకోవలసిందేనా?— తను అలా యెన్నటికీ చెయలేదు. ఈ అల్లకల్లోలంలో అయోమయమైపోకుండా చేయగల్గింది అతణ్ని గురించిన తలంపు ఒక్కటే. అందులో పాల్గొన్నప్పుడే యిక్కడ వుండే రెన్నాళ్ళయినా ఒక మనిషిగా మెసులుకోగలదు—

—గబగబా తలుపువేసి బజారుకి బయల్దేరింది; అతడికేం కావాలా అని ఆలోచించుకుంటూ—ఆ పాత షాపులోకి వెళ్లకూడదు. వాళ్ళేదో తనవంక విచిత్రంగా వింతగాచూస్తారు. కాకపోయి నా లాగులకు చొక్కాలకు గడ్డలు కావాలని కోరితే యెవరలా చూడరు? ఈ వైధవ్యప్రపంచం తీరే అంత. తమకునచ్చిన చీరలుకొనే స్వాతంత్ర్యం వారికి వున్నప్పుడు, తనుమాత్రం నచ్చిన లాగుగుడ్డ కొనుక్కు రాకూడదూ?—అయినా వారి సంకుచితాభిప్రాయాలలో తనకేమిటి లెక్క? అతడికి తెలుపు ఇష్టమని తెలుసు, అతడి స్వభావం ప్రతిబింబించేదికూడా అదేనని తన విశ్వాసం. ఇరవైయైదు రూపాయిలు బిల్లు చెల్లించి, బైటపడి గబగబా నడిచి యింటికొచ్చింది—

—ఇవాళ యెందుకనో అతన్ని విడిచివున్న ప్రతిక్షణమూ తనలో వొకవిధమైన వేదన కలిగించుతోంది. అతడు క్షణాలమీద యిక్కడికువచ్చి వాలితే బాగుండుననిపించుకుంది. అయినా తన కున్న ఆదుర్దా అతని కెందుకుంటుంది? సాధ్యమైనంతవరకూ అతడు తననించి దూరమై పోవడానికే ప్రయత్నించుకున్నాడు. లేనిపోని మమకారం బయటపెట్టి తనను మధ్యపెట్టి మరిపించాలని చూస్తున్నాడా? రాత్రినించీ అతడి ప్రవర్తన అలాగే వున్నట్టు పసికట్ట గల్గినా మొహంయెదట ఏమీ అనలేక, అనే ధైర్యంకూడా చాలక, పెదవులపైకి వచ్చినమాటనే దిగమింగుకుని లోలోపల యేదో సమాధానం పలుక్కుని వూరుకున్నది. కాని అతడలా చేయగలడా? ఏమో...ఎవరికి యెరుక? తను స్త్రీ, అతను పురుషుడు.

ఇంతలో హఠాత్తుగా జ్ఞాపకం వచ్చిందామెకు అతడు పొద్దున్న చెప్పినసంగతి - ఏడుపొచ్చినంత పనైంది. గుండె దడదడా కొట్టుకుంది. మంచంపైన చాపచుట్టలా పడింది. తనకు ఆవేదన హెచ్చినకొలదీ క్షణాలు భల్లగా దొర్లుతున్నయ్, గడియారం అటుకేసి తిప్పి గుండె దిగులుతో కుర్చీలో కూలబడి వడుంవాల్చింది.

ఎంతో సేపు మైకురచ్చి నిదరోదామని చేసిన ప్రయత్నం విఫలమయ్యింది. అయినా కళ్లుమూసుకునే పడుకున్నది. ఆత్రం ఆగక గడియారం ఇటుతిప్పి చూసుకున్నది. తొమ్మిదన్నరకూ అయిదు నిమిషాలు తక్కువ - వీధిసద్దుమణిగింది. అయినా అతడు వచ్చేజాడ తెలియడంలేదు. కాలం గడిచిందని వూహించుకునే సరికి ఆకలి పేగులు గుర్రు మన్నయ్. ఇప్పుడు తనేమీ చేసుకు తినగల స్థితిలోలేదు. కాఫీ అయినా పెట్టుకుంటే బాగుండును, అనుకున్నది, వెంటనే తోచింది మరోకగంట వేచిచూస్తే బాగుంటుందేమో అని. బట్టలు మార్చుకుని అద్దంలో మొహం చూసుకుంటే కళే లేదు; డొక్కుపోయినట్టుంది. బుగ్గమీద చేత్తో రాచుకుంటూ 'తను అందవికారినా' అనుకుంది. కాదని హృదయం విశ్వాసం పలికింది. తన కెప్పుడూ అందాన్ని గురించిన ఆలోచనే రాలేదు. ఒకరికి అందమైనదిగా కనబడాలని ప్రయత్నించలేదు కూడా. రాధ అన్నాడు, నీలాటి తెలివంగల చెలికత్తె ప్రక్కన వుంటే తలెత్తుకు తిరగగల'నని. అది అతని హృదయాంతరాళంనుండి వచ్చిన మాటేనా? తనను సన్నిహితురాల్ని చేసుకోవడానికి వేసిన యెత్తా? అతని మెప్పుకోలు తనని ఉన్నతస్థాయికి తీసుకుపోయిందా మానసికంగా? అదే తన జీవిత చరమ లక్ష్యమా?—అతి వింత హృదయం లేకుండా అనివుంటాడా? అయినా అతను తన కేమిటి? ఈ ప్రశ్న తిరిగి రావడంతో గిజాటుగా కణతలు వేళ్ళతో నొక్కుకుంటూ వాలిపోయింది.—

నో క్రమాలకి తలుపుతడుతున్న చప్పుడయింది. మారు పలకక పలికే వోపిక లేక కొన్ని క్షణాలపాటు కళ్లప్పగించి చూస్తూ వుండిపోయింది. అతను తన పరిస్థితి ఊహించిన వాడిలా తలుపు తట్టడం మాని పేరుపెట్టి గంభీరంగా పిలుస్తున్నాడు. ఆ స్వరం చెవుల బడడంతో అంతవరకుండిన ఆలోచనలు వెనకబడి ఒక నూతనోత్సాహం పొంగివచ్చినట్లయింది—అది ఆమెలోని మానసిక బలహీనతా, అమాయకత్వమా? నిర్ణయించుకోలేక చివాల్న లేచివచ్చి గడియ సడలించింది. అతను నేరుగా వచ్చి చేతులోవున్న పొట్లాలు బల్లపై పెట్టి కుర్చీలో కూర్చుంటూ "భోంచేశావా?" అని అడిగాడు. 'చేశానని చెబితే!'—అతనియెదుట తను అబద్ధమాడలేదు. ఒకవేళ అలాంటి పొరపాటు జరిగినా మొహంమీంచి కళ్లల్లోకి చూసి అంతర్యాలు చదువుకునేపాటి తీక్ష్ణదృష్టి అతనిది. 'లేదు' అని చెప్పేసింది సుందరి.

'ఆ పొట్లాలిలా యిచ్చి స్టూలు దగ్గిరకు లాక్కో' అని చేయి చాచాడు రాధ.

'నాకు 'ట్రాన్స్ఫర్ మెమో' ఇచ్చారు, ఇవ్వాళనించే ట్రాన్సిట్' ఈ అశుభాన్ని తన నోటితో ఉచ్చరించే శక్తి లేదన్నట్టు వణుకుతున్న కంఠంతో అన్నది సుందరి అతడి చేతికి పొట్లాలు అందిస్తూ.

"తెలిసే ఇప్పుడు వచ్చాను, ఇక్కడ యేం గొడవ పడుతున్నావో అని. ఆవేశం జాస్తి నీకు, కాకపోయినా, మళ్ళీ చంటి పాపవి కావు." రాధ పొట్లాలు విప్పి పదార్థాలు సగం పంచి వేశాడు. తిరిగి యిలా అందుకున్నాడు—

"కానీ, ఎప్పుడూ—పెళ్ళైనాసరే—లంఖణం పడుకోవడం నేర్చుకోకు. కడుపు కాల్చుకుని సాధింపగల్గింది బహు తక్కువ" అంటూ వొక్క సారా లడ్డూ వొదుపుగా నోటి కందించాడు.—

అతడన్న ఆ మాటతో తిరిగి పాతపుండు రేగినట్లయిందామెకు. అతను యీధోరణిలో యిలా యెందుకు మొదలెట్టినట్లు? ఇకే కడసారి వప్పగింతా? ఈ వొక్కమాట అని తనను వేధించడానికే యిప్పుడు అదరాబదరా పరుగెత్తుకు వచ్చాడా! ఈ అవస్థలూ అతడనే ఆమాట తనపై యెంతటి నిప్పుల గాడ్పులు విసురుతుందో వూహించుకోలేకనే అన్నాడా? తెలిసి తెలిసి యెందుకింత దారుణం తలపెట్టినట్టు? ఈ మాటతో తనయెడల అతని కర్తవ్యం, బాధ్యత ముగిసిపోయినట్టే భావించి అంటున్నాడా?—ఆకలి సెగలకు తోడి ఆలోచనల పొగలు మరింత కమ్ముకుని గజిబిజి చేస్తుంటే ఆమె యేటూ తోచక ఏమీ అనలేక అతని వంక తదేకంగా చూస్తూ వుండిపోయింది. "మంచినీళ్లు" అన్న అతని పిలుపుతో ఉలిక్కిపడి అక్కణ్ణించి లేచి నడిచింది.

"పోనీ అతడే తనని పెళ్లి...చేసుకోకూడదూ? అందుకు తను సిద్ధమేనా? అతని అంతస్థుకు తను తగదా? అంతస్థు? ఎవరి తాహతును ఎవరు నిర్ణయించగలరు? హృదయంలేని స్వార్థపరత్వాన్నే అతనూ పట్టుకు పాకులాడుతున్నాడా యిన్నాళ్లూ? తన యెడల ఆత్మీయతను ప్రకటించి యెన్నిసార్లు కొండెక్కించలేదు?—మంచినీళ్ల గ్లాసు బల్లపై పెడుతూవుండగా అనిశ్చితత్వం ఆట్టేసేపు ధరించలేనన్న, అతడి మాటలు స్ఫురణకువచ్చి, కళవళంగా వొణికిపోవడంతో వేళ్లు పట్టుతప్పి గ్లాసు జారి కిందపడిపోయింది. అతను తలెత్తి సూటిగా ఆమె మొహంలోకి చూశాడు; అన్నాడు.

"అనుకుంటూనే వున్నా" అంత పనిచేస్తావని, ఏదో అనుకుని మరేదో చెయ్యబోవడం తెలివితక్కువ. తాత్కాలిక ఉద్రేకాలకు లొంగిపోతే ఆశించిన ఫలితం అందక పోగా పర్యవసానం భయావహంగా వుంటుందని తెలియదూ? అది గ్రహింపజేయడానికే యిన్నాళ్లూ పాటుపడ్డాను. కొత్త బాధలు వచ్చిపడుతున్నప్పుడు వాటిని తట్టుకోవడానికి కావలసిన గుండె నిబ్బరం పరిస్థితులే చేకూరుస్తూ వుంటయ్. ఆ ధైర్యంతోనే, నేనూ లాక్కొస్తున్నాను. ఆపాటి గుండె దిటవులేనివాళ్లకి, భవిష్యత్తు అయోమయంగా వుంటుంది. ఎంతవరకూ దక్కినదే చాలననే తృప్తిలో వున్నవాళ్లకు ఏ బాధా వుండదు. నాలుగు లడ్డూలు తిని నీళ్లుతాగి ఆకలి చల్లార్చుకో! అన్నీ తీరుబడిగా ఆలోచించుకోవచ్చు, అర్థంలేని ఆరాటాలకు పోయి మనసు పాడుచేసుకోవడం మంచిది కాదు." అంటూ అక్కణ్ణించి లేచివెళ్లి గడియారం బల్లమీద పెట్టివున్న పొట్లాం యేమిటో అని విప్పి చూడబోతున్నాడు.—"ని వేదాంతాలు నాకేవీ అక్కర్లేదు" అన్నది సుందరి; నిరుత్సాహం వెలువరించిన ఆవేశం గుండెల్లో గుబులుగా రగిలిస్తూ వుంటే—

అతడన్ని విషయాలలాగే ఆ మాటలనూ గాఢంగా తీసుకోక చులాగ్గా సమాధానం చెప్పాడు. "అర్థం కాని మాటలన్నీ వేదాంతాలే అనుకుంటారు చాలామంది. నిజానికి వేదాంతం చెప్పే

తాహతు చాలదు. వినే యోగ్యత నీకు లేదు. జీవితంలో వొక విచిత్రమైన అనుభవాన్ని మాత్రమే కూడగట్టుకుని వచ్చిన మాటలు నావి. విసవబతుకు, రోజా కాకతీరు. ఆలోచించితే చివరికి మిలిగేది యేమీవుండదు-" పొట్లం తిరిగికట్టి బల్లమీద పెట్టాడు—

ఆమె నాలుగడుగులు ముందుకునడిచి ఆవేశంతో యేదో అనబోయి, గొంతు పెగలక గుక్కిళ్లు మిటకరించి చూస్తూ వుండి పోయింది. అవకాశం చిక్కినా అనదల్చుకున్నది అనలేక పోవడం, ఈ బలహీనతను అసరాగా జూసుకుని అతడు తనను అన్ని విధాలా అణగద్రొక్కుతూ వుండడం గమనించితే ఆమెకు కన్నీరు తప్ప మరేమీ సమాధానం అందలేదు. తన మూగబాధను చూసి అతడు జాలిపడి మరేవో కొత్త పరిష్కారాలు వెదికి తనకు ముందుదారి నిర్దేశించగలడని, విశ్వసించడంలోని బలహీనత, ఇవాళ్టిలా ఇన్ని విధాలుగా తనను అణచివేస్తున్నదని ఆమె హృదయంలో సుళ్లు తిరుగుతున్నా, ఆ వూహలు అంతటితోనే అంతరించి శూన్యం యేర్పడుతున్నది క్షణంలోనే—

అతిక్రమించలేని ఏదో వొక ప్రాపంచిక సత్యం తనని తీరుగా కట్టివేస్తున్నదని స్ఫురణకు వచ్చినప్పుడు దానికి తనూ బాధ్యురాలనుకో నేపాటి వెనుక చూపు, మనసులోని మథన, ఇంతటితో దీనిని అంతం చేసుకోంటేనే బాగుంటుందనే అవ్యక్తమైన ఆరాటం, తన జీవితంపై యెనలేని ప్రభావం చూపిన కొన్ని భౌతిక వాంఛల ప్రాబల్యం విల్లుతో కూడిన వొక తీవ్రమైన భావశబలత, ఆమె కళ్లల్లో ప్రస్ఫుటంగా కనబడుతున్నా, గ్రహించగలిగే అందుకు ప్రయత్నించదని రాఘుముఖంలో యేవిధమైన వికారమూ కనబడలేదు. పై పెచ్చు అన్ని భౌతిక వాంఛలూ వదలి అవ్యక్త ఆనందం కోసం ఆరాటపడబోయే ఆతురసన్యాసిలా ముఖకవళికల్ని మార్చుకుని పెదవి విరిచి యిలా అందుకున్నాడు— "అనువు, ఏంచేస్తాం మరి! పరిస్థితుల ప్రాబల్యానికి అందరూ తలొగ్గవలసినదే. మరి ఈ సంయోగవియోగా లనేవి శరీరాలకుగాని ఆత్మలకు కావుగదా! ప్రవాహంలో కలిసి కొట్టుకుపోయే కొయ్యగ్రద్దల్లా కొంతకాలం కలిసివుంటాం, మరి యేదో తరంగం గాటంగా తగలగానే యెవరిదారివారు చూసుకో వలసివుంది. ఏమైనా, తోసుకువస్తున్న ప్రవాహాన్ని కాదని నిలవ గల వారెవ్వరు? అందుకు సిద్ధమైనప్పుడే జీవితశేషం సాఫీగా సాగి పోతుంది."—ఏదో లోకంలోనించి వినబడుతూన్నట్లున్న అతని మాటలు చెవులబడుతున్నా ఆమె చలించలేదు.

తను ఆశించింది యీ పర్యవసానం కొరకేనా? చివరికి తనేం మిగుల్చుకున్నట్టు? దానికి ప్రత్యుత్తరమూ తనే చెప్పుకోవాలి! రాఘ చెప్పే మాటలన్నీ యిలాగే వుంటాయ్ అది అతనికి సహజమేనని గుర్తించి వర్తించకపోవడం తనతప్పు కాదూ? అవసరం తీరాక పెదవులకు రాచుకున్న పంచదార నాకేసి పాడిగా చప్పరించి వూరుకుంటారు కొందరు. రాఘ అలాటివారి కోవలోనే చేరుతాడా? తనిప్పుడు ఏమయ్యింది? ఏమీ కాలేదు. మరోలోకపు ప్రాంగణం లోకి అడుగు పెట్టబోతున్నది. ఎక్కణ్ణించి వచ్చావని ఎవ్వరైనా ప్రశ్నిస్తే 'రాఘ దగ్గిర్నుంచి' అని చెప్తుందా? అలా యెన్నటికీ జరగదు. తనను పంపినవాడు రాఘ కాదు. తనే అతణ్ణి విడిచి వెళ్లి పోతున్నది. పాతబంధాలు వదిలించుకుని బయటపడుతున్నది. అతనూ అలాగే అనుకుంటాడా!

చివాల్న అక్కణ్ణించి కదిలి గుమ్మంలో అడుగుపెట్టాడు రాఘ. 'సరే వెళ్లివస్తా, వీలుంటే రేపు రైలుదగ్గిర కలుసుకుంటా,' అంటూ అడుగు బైటపెట్టాడు. రావద్దని చెబుదామని నాలుక చివరకు వచ్చిందిమాట. అంతలోనే అతడు వడిగా ముందుకు సాగి పోయాడు.

ఆ మొన్నాడు అతడు వచ్చేసరికి రైలు దాటిపోయింది.